పాడి రైతుల ఎదురుచూపులు

● రెండు నెలలుగా బిల్లులు పెండింగ్
● ప్రభుత్వ తాత్సారం.. అధికారుల నిర్లక్ష్యం

దుగ్గొండి : పాల బిల్లుల కోసం మండల పాడి రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. రెండు నెలలుగా బిల్లులు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం తాత్సారం చేస్తుండగా, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బిల్లులు ఎప్పటికప్పుడు ఇప్పించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమను ఎంచుకుంటున్న తమకు ఏంటి ఈ దుస్థితి అని వేదనకు గురవుతున్నారు.

మండల పరిధిలో 14 కేంద్రాల ద్వారా విజయ డెయిరీ పాలను సేకరిస్తోంది. గతంలో దళిత సామాజికవర్గానికి చెందిన రైతులకు సబ్సిడీపై గేదెలను అందించడంతో పశు సంపద పెరిగి పాడి లభ్యత ఎక్కువయ్యింది. నర్సంపేటలో ఉన్న ప్రధాన కేంద్రం ద్వారా 56 కేంద్రాల నుంచి ప్రతిరోజూ 3–4 వేల లీటర్ల పాలను సేకరిస్తున్నారు. మొత్తం 2460 మంది రైతులు డెయిరీకి పాలు పోస్తున్నారు. పాడి రైతులకు 15 రోజులకు ఓసారి బిల్లు చెల్లించడం ఆనవాయితీ. కాగా ఈ ఏడాది అక్టోబర్, డిసెంబర్ బిల్లులు ఇప్పటివరకు చెల్లించలేదు. బిల్లులు రాకపోవడంతో రోజువారీ ఖర్చులతోపాటు పిల్లల చదువులకు ఫీజులు చెల్లించలేకపోతున్నామని పాడి రైతులు వాపోతున్నారు.

పత్తాలేని ఇన్సెంటివ్

పాడి రైతులను మరింత ప్రోత్సహించేలా గతంలో ప్రభుత్వం ఇన్సెంటివ్ పథకాన్ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. లీటరు పాలపై రూ.4 చొప్పున చెల్లించేలా ప్రభుత్వం నిర్ణయించింది. రైతుల బ్యాంక్ ఖాతా వివరాలు సేకరించింది. కాగా ఇప్పటివరకు ఏడేళ్లు గడచినా ఇన్సెంటివ్ చెల్లించిన దాఖలాల్లేవు. ప్రస్తుతం పాయింట్ గేదె పాలకు రూ.7.50, ఆవు పాలకు ప్రభుత్వం రూ.13.50 చెల్లిస్తోంది.



రూ.96 వేలు పెండింగ్

నేను 4 పాడి ఆవులను సాకుతూ ప్రతిరోజూ 40 లీటర్ల పాలు విజయ డెయిరీ కేంద్రంలో పోస్తున్నాను. 15 రోజులకోసారి నాకు రూ.24 వేలు రావాల్సి ఉంది. అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు నాలుగు బిల్లులకు సంబంధించి మొత్తం రూ.96 వేలు రావాల్సి ఉంది. నిర్వాహకులను ఎన్నిసార్లు అడిగినా వస్తాయంటూ సమాధానమిస్తున్నా బిల్లులు మాత్రం అందడం లేదు. బిల్లులు రాకపోవడంతో కుటుంబ పోషణకు ఇబ్బందిగా ఉంది.

– ఎరెల్లి రాజు, పాడి రైతు, నాచినపల్లి

నిధులు విడుదల కాగానే చెల్లిస్తాం

పాడి రైతులకు సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో ఒక్కో బిల్లు చొప్పున పెండింగ్‌లో ఉన్నాయి. బిల్లుల చెల్లింపులో మా నిర్లక్ష్యం ఏమీ లేదు. ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నాం. ప్రభుత్వం నుంచి డబ్బు రాగానే డెయిరీకి అందుతాయి. తదనుగుణంగా పాడి రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తాం. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో బిల్లులు చెల్లించే దిశగా చొరవ తీసుకుంటున్నాం.

– శ్రవణ్‌కుమార్, డిప్యూటీ డైరెక్టర్, విజయ డెయిరీ

చైతన్యయుత పోరాటాలే ధ్యేయం



నర్సంపేట : పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న రమేశ్

● సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు రమేశ్

నర్సంపేట : సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యయుత పోరాటాలు నిర్మించడమే సీపీఐ ధ్యేయమని రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేశ్ తెలిపారు. ఆ పార్టీ ఆవిర్భావ ఉత్సవాలను పురస్కరించుకుని నర్సంపేటలోని మాదన్నపేట రోడ్డు, అంబేడ్కర్‌లో సెంటర్‌లో పార్టీ జెండాను గురువారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడారు. ఎంఎన్ రాయ్ దంపతులు మరికొందరితో కలిసి 1925లో డిసెంబర్ 26న ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్‌లో పార్టీని స్థాపించారని చెప్పారు. ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోరాటాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు అక్కపల్లి రమేశ్, నాయకులు మునీశ్వర్, కవిత, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండ : మండల కేంద్రంలో సీపీఐ జెండాను ఆ పార్టీ మండల అధ్యక్షుడు కందిక చెన్నాకేశవులు ఆవిష్కరించి మాట్లాడారు. ఉద్యమాలతో నిర్మించుకుని, ప్రజాసమస్యల పరిష్కారంలో పాత్ర పోషిస్తున్న ఏకైక పార్టీగా అభివర్ణించారు. కార్యక్రమంలో నాయకులు పర్వతం ఎల్లస్వామి, ప్రవీణ్, పిట్టల బుచ్చయ్య, దబ్బెట వీరయ్య, నర్సయ్య, ముత్యాల శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండల కేంద్రంలో పార్టీ జెండాను జిల్లా కమిటీ సభ్యుడు గుంపెల్లి మునీశ్వర్ ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పత్తి అనంతరెడ్డి, సహాయ కార్యదర్శి నర్సింహ, సభ్యులు కూతురు దామోదర్‌రెడ్డి, గట్ల కృష్ణ, కట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హనుమాన్ విగ్రహ పునఃప్రతిష్ఠాపన



ఖానాపురం : మండలంలోని వేపచెట్టుతండాలో హనుమాన్ విగ్రహాన్ని గురువారం పునఃప్రతిష్ఠించారు. జాతీయ రహదారి పనుల్లో భాగంగా హనుమాన్ ఆలయం అడ్డుగా ఉండడంతో అక్కడి నుంచి మరోచోటికి తరలించి అర్చకుల వేదమంత్రోచ్ఛరణల నడుమ ప్రతిష్ఠించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షుల ఎన్నిక



పర్వతగిరి : మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్ నాయక్ ఆధ్వర్యంలో 262, 264వ బూత్ కమిటీల అధ్యక్షులను గురువారం ఎన్నుకున్నారు. 262వ బూత్‌కు గోనె సంపత్, 264వ బూత్‌కు బొట్ల మధు అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. అనంతరం ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పట్టాపురం ఏకాంతంగౌడ్ మాట్లాడారు. బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ కమిటీ సభ్యుడు హరకవత్తు వినోద్‌నాయక్, నాయకులు చీమల భిక్షపతి యాదవ్, రంగు కుమారస్వామి గౌడ్, గూడెల్లి ప్రభాకర్, చల్ల రాజు, చిన్నపెల్లి వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

నియామకం



రాయపర్తి : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం పాలకుర్తి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా తనను రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాస్ నియమించినట్లు మండలంలోని పెర్కవేడుకు చెందిన చిన్నపాక భద్రయ్య తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో సేవలను గుర్తించి తనకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి పోరాడతానని తెలిపారు.

వాహనం బోల్తా.. ఇద్దరికి గాయాలు

ఖానాపురం : వాహనం బోల్తా పడి ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలోని బుధరావుపేట గ్రామ శివారులో గురువారం చోటు చేసుకుంది. వివరాలిలా.. మంగళవారిపేటకు చెందిన వ్యాపారి టాటా ఏసీ వాహనంలో రైతుల నుంచి కొనుగోలు చేసిన పత్తి తీసుకెళ్తుండగా సదరు వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ క్రమంలో వాహనంలో పత్తిపై కూర్చున్న ఆరుగురు హమాలీలు పడిపోగా మేకల రవి, దూడం రమేశ్ స్వల్ప గాయాల పాలయ్యారు. వారిని చికిత్స నిమిత్తం నర్సంపేటకు తరలించారు.

పరామర్శ



పర్వతగిరి : కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, బొంపల్లి దేవేందర్‌రావు మండలంలోని ఏనుగల్‌లో గ్రామ పంచాయతీ కారోబార్ తక్కళ్లపల్లి వెంకటేశ్వర్‌రావును అతడి తల్లి కాంతమ్మ మృతి చెందగా గురువారం పరామర్శించారు. కాంతమ్మ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే పులి ఎల్లగౌడ్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఎల్ల గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు గుండారపు అంజన్‌రావు, మాసాని యాకూబ్, యూత్ కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు ఉడుతబోయిన కృష్ణ, నాయకులు మాసాని భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడికి..

రాయపర్తి : మండలంలోని శివరామపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు నాగపురి సోమయ్య కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్ ఆధ్వర్యంలో గురువారం పరామర్శించారు. సోమయ్యకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ

ఆత్మకూరు : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో గురువారం 16వ ఈజీఎస్ సామాజిక తనిఖీ కొనసాగింది. మండల కేంద్రంలో ఆడిట్ బృందం క్షేత్రస్థాయి ఈజీఎస్ పనులను పరిశీలించారు. గ్రామసభలో 20 కుటుంబాలు ఉపాధి హామీ జాబ్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓలో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ రాజిరెడ్డి, ఎస్‌ఆర్‌పీ రమేశ్, డీఆర్‌పీ రాజ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి శ్వేత పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ


పడిపూజలో పాల్గొన్న ఎలందర్‌రెడ్డి, అయ్యప్ప భక్తులు

వర్ధన్నపేట : పట్టణంలోని భారతీయ నాటక కళా సమితి ఆవరణలో స్థానిక గురుస్వామి కొమాండ్ల వెంకట్‌రెడ్డి–ప్రభావతి దంపతులు, ఇల్లంద శివారు హరిహర క్షేత్రంలో ఊట్ల సంధ్యారాణి–సతేందర్ రెడ్డి దంపతులు గురువారం అయ్యప్పస్వామి పడిపూజ ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో మునిసిపల్ వైస్ చైర్మన్ కోమాండ్ల ఎలందర్‌రెడ్డి, ఈగ మల్లేశం, పీఏసీఎస్ చైర్మన్ రాజేశ్ ఖన్నా, కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు మైస సురేశ్, నాయకులు గజ్వెల్లి రాజ్‌కుమార్, అనిమిరెడ్డి కృష్ణారెడ్డి, పత్రి భానుప్రసాద్, సిలువేరు శ్రీధర్, యాదగిరి, రాంచంద్రారెడ్డి, సుజాత, వెంకట్, మల్లారెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



మంచినీటి పైపులోకి మురికినీరు

అధికారుల నిర్లక్ష్య ఫలితంగా ప్రజలకు తాగడానికి మురికినీరు సరఫరా అవుతోంది. మండల కేంద్రంలోని పీరీల సవ్వడి (రావి చెట్టు) సమీపంలో ఇంటికి కనెక్షన్ ఇచ్చే మిషన్ భగీరథ పైపు పగిలి నీరు వృథాగా పోతోంది. ఆ ప్రదేశంలో చెత్తాచెదారం, ఆకులు పడి దుర్గంధం వెదజల్లుతోంది. మురుగునీరు పైపులోకి వెళ్లి అపరిశుభ్రమైన నీరు సరఫరా అవుతోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ఇకనైనా అధికారులు పగిలిన పైపులైన్‌కు మరమ్మతు చేయించి శుభ్రమైన నీరు సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు. – చెన్నారావుపేట

ప్రశ్నించాల్సిన అధికారి పేరు :
రంజిత్, పంచాయతీ కార్యదర్శి
ఫోన్‌నంబర్ : 9704343688

మున్సిపాలిటీ ఏర్పాటులో నిర్లక్ష్యం

● మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

నెక్కొండ : నెక్కొండ మునిసిపాలిటీ ఏర్పాటులో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌజ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసముద్రం మునిసిపాలిటీగా ఏర్పాటు కావడం ఖాయమని బలమైన సంకేతాలు వినిపిస్తున్నాయని చెప్పారు. నెక్కొండ మునిసిపాలిటీ కలగానే మిగలనుందని ఆందోళన వెలిబుచ్చారు. నెక్కొండ మునిసిపాలిటీపై ఎమ్మెల్యే మాధవరెడ్డి స్పందించిన దాఖలాలు లేవన్నారు. ఆయన పట్టించుకోకపోవడంతో స్పష్టత కరువై ప్రజల్లో అయోమయం నెలకొందని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నెక్కొండ మేజర్ గ్రామ పంచాయతీగా ఎన్నికలకు పోతుందా? లేక మునిసిపాలిటీగా ఎన్నికలకు పోతుందా? అనే విషయమై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ మారం రాము, బీఆర్‌ఎస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు సంగని సూరయ్య, కొణిజేటి భిక్షపతి, మాజీ ఎంపీపీ రమేశ్‌నాయక్, నాయకులు షేక్ అబ్దుల్ నబి, లావుడ్యా హరికిషన్, తదితరులు పాల్గొన్నారు.

‘డివైడర్ తొలగింపుపై చర్యలు తీసుకోండి’


డివైడర్లను పరిశీలిస్తున్న రవీందర్ తదితరులు

వర్ధన్నపేట : పట్టణంలోని ఖమ్మం–వరంగల్ ప్రధాన రహదారిపై మీదున్న డివైడర్‌ను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని మాదిగ ఐక్య సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మిద్దెపాక రవీందర్ ప్రభుత్వాన్ని కోరారు. సదరు ప్రదేశాన్ని ప్రజాసంఘాల నాయకులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడారు. రహదారుల విస్తరణలో భాగంగా పెద్దమొత్తంలో ప్రజాధనాన్ని వెచ్చించి ప్రభుత్వం డివైడర్లు నిర్మించగా కొందరు వ్యాపారస్తులు ప్రైవేటు కట్టడాల కోసం సుమారు 500 మీటర్ల మేర డివైడర్లను అనుమతి లేకుండానే రాత్రికి రాత్రే తొలగించారని చెప్పారు. అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. కార్యక్రమంలోసంఘం రాష్ట్ర అధ్యక్షుడు జన్ను రాములు, టీఎంఆర్‌పీఎస్, మాదిగ పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శులు మరుపట్ల అంజయ్య, ఈరెల్లి శ్రీనివాస్, అంబేడ్కర్ సంఘం జిల్లా కన్వీనర్ వివేకానంద, రాష్ట్ర నాయకులు మారపల్లి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు విప్లవ పార్టీల విలీన సభ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నర్సంపేట : హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 28న రెండు న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభ నిర్వహిస్తామని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఎలకంటి రాజేందర్ తెలిపారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో విలీన సభ పోస్టర్లను గురువారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. పాలకులు అవలంబిస్తున్న దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను సంఘటితం చేసే దిశగా పార్టీలు విలీనం అవుతున్నాయని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీలు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమయ్యాయని తెలిపారు. భూమి మీద దోపిడీ, అణచివేత, అసమానతలు, ఆకలి, నిరుద్యోగం ఉన్నంత కాలం విప్లవోద్యమం సజీవంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు గట్టి కృష్ణ, జక్కుల తిరుపతి, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అజయ్, రైతు కూలీ సంఘం నాయకులు సాంబన్న, ఆకుతోట రాజు తదితరులు పాల్గొన్నారు.

బోనస్ చెల్లించాలని రైతుల నిరసన

పర్వతగిరి : సన్న ధాన్యానికి సంబంధించి బోనస్ చెల్లించాలని కోరుతూ మండలంలోని జమాల్‌పురం రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మీడియా ఎదుట గోడు వెళ్లబోసుకున్నారు. గ్రామంలో రోళ్లకల్ నవజీవన్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో సన్న వడ్లు విక్రయించి 15 రోజులు గడిచిందని, ధాన్యం డబ్బులు బ్యాంకు కాతాలో జమ అయినప్పటికీ ఇప్పటివరకు బోనస్ డబ్బులు పడలేదని చెప్పారు. కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు సమస్య వివరించినా పట్టించుకోకపోగా దురుసుగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి తమకు బోనస్ పడేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో రైతులు గోపాల్‌రావు, పిడుగు ఎల్లయ్య, పిడుగు ఉప్పలయ్య, బండి మల్లయ్య, సాంబయ్య, భైరబోయిన సంపత్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక

వర్ధన్నపేట : మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని కాలువ నందిని జూడో రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు ఎంపికైనట్లు ఆ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు వేణు తెలిపారు. నందిని 40 కేజీల విభాగం జిల్లాస్థాయి పోటీల్లో ప్రతభ చాటి ప్రథమ స్థానంలో నిలిచిందని చెప్పారు. కరీంనగర్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని వివరించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి మండల, తల్లిదండ్రుల కీర్తిప్రతిష్ఠలు ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. నందినిని ఏఏపీఎస్ అధ్యక్షురాలు రజిత, పీఈటీ వీరస్వామి, ఉపాధ్యాయులు ఉషారాణి, శ్రీదేవి, రాజు, లింగమూర్తి, విజయ్, సదానందం, మాధవరావు అభినందించారు.

‘కేంద్ర మంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పాలి’


నినాదాలు చేస్తున్న నాయకులు

గీసుకొండ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని రజక రిజర్వేషన్ పోరాట సమితి (ఆర్‌ఆర్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్ గాడ్గే డిమాండ్ చేశారు. మండలంలోని మనుగొండలో దళిత బహుజన ఫ్రంట్, మాలమహానాడు సంయుక్త ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి గురువారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడారు. కేంద్ర మంత్రి పదవిలో ఉన్న అమిత్ షా ప్రపంచ దేశాలు గౌరవిస్తున్న అంబేడ్కర్‌ను కించపర్చేలా మాట్లాడడం సరికాదన్నారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేశ్, పూలే సామాజిక న్యాయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కేడెల ప్రసాద్, నాయకులు కొమ్ము మల్లస్వామి, తుప్పరి నర్సయ్య, మాదాసి కట్టమల్లు, జన్ను సాంబయ్య, కొమ్ము ఆనందం తదితరులు పాల్గొన్నారు.

యూపీఎస్సీ ఫలితాల్లో ఆనంద్ ప్రతిభ

● కేంద్ర కార్మిక శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా నియామకం



నియామక పత్రం అందుకుంటున్న ఆనంద్

నర్సంపేట : నర్సంపేటకు చెందిన యువకుడు ఆనంద్ యూపీఎస్సీ ఫలితాల్లో ప్రతిభ కనబర్చాడు. ఈ మేరకు కేంద్ర కార్మిక, ఉపాధి శాఖల మంత్రి మన్సుక మాండవియా చేతుల మీదుగా చెన్నై కార్మిక శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా నియామక ఉత్తర్వులు గురువారం అందుకున్నాడు. నర్సంపేటకు చెందిన ఆంబోతు భద్రయ్య–అరుణ దంపతుల కుమారుడు ఆనంద్ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే ఆకాంక్షతో హైదరాబాద్‌లో ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. చెన్నైలో పెట్రోలియం సంస్థలో హెచ్‌ఆర్ విభాగంలో పని చేస్తూనే యూపీఎస్సీ ద్వారా కార్మిక శాఖలో ఉద్యోగం సంపాదించాడు. ఆయన సోదరుడు సంతోశ్ కూడా ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ (ఐబీఎం)లో మైనింగ్ ఇంజనీర్‌గా ఉద్యోగం సాధించాడు. మారుమూల ప్రాంతం నుంచి అత్యున్నత ఉద్యోగం సాధించిన ఆయన యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడు.

చికిత్స పొందుతున్న రైతు మృతి


రవీందర్‌రెడ్డి (ఫైల్)

వర్ధన్నపేట : ప్రమాదవశాత్తు చెట్టుకొమ్మ తగిలి గాయాలపాలైన రైతు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని కట్ర్యాల గ్రామ శివారులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కడారిగూడెంకు చెందిన రైతు దోపతి రవీందర్‌రెడ్డి (40) బుధవారం ద్విచక్ర వాహనంపై వస్తుండగా రోడ్డుపై వేలాడుతున్న చెట్టుకొమ్మ ప్రమాదవశాత్తు తగిలింది. దీంతో ఆయన తలకు గాయాలు కావడంతో స్థానికులు ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న రవీందర్‌రెడ్డి గురువారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

‘మున్సిపాలిటీలో గ్రామాల విలీనం సరికాదు’

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని ఏడు గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేయడం సరికాదని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని ఆ పార్టీ మండల కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మునిసిపాలిటీలో విలీనం చేస్తే గ్రామాలు స్వయం ప్రతిపత్తిని కోల్పోతాయని, పేదలకు ఉపాధి హామీ పథకం వర్తించదని, ఇళ్ల నిర్మాణానికి పేదలు పెద్దమొత్తంలో రుసుము చెల్లించాల్సి ఉంటుందని, పన్నుల భారం పెరుగుతుందని వివరించారు. ఇంకా అనేక సమస్యలతో ప్రజలు సతమతమయ్యే ప్రమాదం ఉందన్నారు. గ్రామాల విలీనం ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ ఎంపీపీ మోతె కళావతి, రైతు సమన్వయ కమిటీ మండల అధ్యక్షుడు మోతె జయపాల్‌రెడ్డి, నాయకులు పద్మనాభరెడ్డి, పెండ్యాల ప్రభాకర్, అంగోతు సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

‘ఆర్‌ఐపై దాడి హేయం’

పర్వతగిరి : మేడ్చల్ జిల్లాలోని కాప్రా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమేశ్‌పై దాడి హేయమని ట్రెంగా జిల్లా అధ్యక్షుడు భూక్య కస్నా అన్నారు. మండల కేంద్రంలో విలేకరులతో గురువారం ఆయన మాట్లాడారు. విధినిర్వహణలో భాగంగా ప్రభుత్వ భూమిని పరిరక్షిస్తున్న ఆర్‌ఐపై దుండగులు దాడికి పాల్పడ్డారని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు దుర్మార్గమని చెప్పారు. ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం స్పందించి దాడిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులను గుర్తించి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తద్వారా భవిష్యత్‌లో దాడులు జరగకుండా చూడాలని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు తప్పవని హెచ్చరించారు.

లక్ష్మీనృసింహుడికి స్వాతినక్షత్ర పూజలు


మంగళ సూత్రాలను చూపుతున్న అర్చకులు


పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లిలోని స్తంభ నారసింహుడికి గురువారం అభిషేకం, సుదర్శన హవనం, కల్యాణం జరిపించారు. ధనుర్మాసంలో 11వ రోజును పురస్కరించుకుని నిత్యపూజ, గోదా, కృష్ణుల ఉత్సవ విగ్రహాలకు పూజలు నిర్వహించి తిరుప్పావై సేవాకాలం మంగళాశాసనం నిర్వహించారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామి స్తంభ మూర్తి, గర్భాలయంలోని ధ్రువ మూర్తులు, ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో అర్చకులు అభిషేకం జరిపించారు. తర్వాత సుదర్శన నారసింహ హోమం చేశారు. లక్ష్మీనరసింహస్వామి, శ్రీదేవి, భూదేవి–వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు కల్యాణం పాంచరాత్ర ఆగమానుసారం జరిపించారు. నీరాజన మంత్రపుష్పంతో పాటు నక్షత్ర హారతి సమర్పించారు. ఆచార్యులు వెంకటరత్నం, జయకృష్ణ, అరుణ్‌కుమార్, విక్రమ్ పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

పర్వతగిరి : గీత కార్మికుడు తాటిచెట్టుపై నుంచి పడి గాయాల పాలైన ఘటన మండలంలోని గోపనపల్లిలో గురువారం చోటు చేసుకుంది. వివరాలిలా.. గ్రామానికి చెందిన గీత కార్మికుడు కులవృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. ఆయన కాలు విరిగిపోగా స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలించారు. అశోక్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

బైక్ అదుపు తప్పి..

వర్ధన్నపేట : బైక్ అదుపు తప్పి కింద పడగా వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని ఇల్లంద శివారులోని వరంగల్–ఖమ్మం రహదారిపై గురువారం చోటుచేసుకుంది. వివరాలిలా.. రాయపర్తి మండలంలోని కాట్రపల్లికి చెందిన బూడిద సదానందం నడుపుతున్న బైక్ ఇల్లంద శివారులో ప్రమాదవశాత్తు కింద పడిపోయింది. దీంతో సదానందంకు గాయాలయ్యాయి. స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.